క్లుప్తంగా

నేడు పోరుబాట

కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి(సైదాపురం): విద్యుత్ చార్జీలపై వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి సంబంధించి మంగళవారం నేదురుమల్లి నివాసంలో కరపత్రాలను ఆవిష్కరించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల పొలంబాట



పొలంలో వరి నాట్లు వేస్తున్న చిన్నారులు

చిల్లకూరు: మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పొలం బాట పట్టారు. పొలం పనులు చేస్తూ, నాట్లు వేస్తూ అలరించారు. చింతవరం గ్రామంలోని రేస్ స్కూల్ చిన్నారులు పాఠశాల అధినేతలు బాలచెన్నయ్య, సుబ్బయ్య ఆధ్వర్యంలో పొలాల్లో వరి నాట్లు వేసి, పల్లె పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్టంగా భద్రతా చర్యలు

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధి పెద్దది కావడంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని రూరల్ పోలీసులకు గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ సూచించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో రోల్ కాల్ చేయించడంతోపాటు డ్రిల్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణం విస్తరిస్తున్న క్రమంలో అప్పుడప్పుడు కార్డన్ సెర్చ్‌లు చేస్తున్నప్పటికీ క్రైం రేట్ తగ్గడం లేదని తెలిపారు. అందుకే భద్రతను పటిష్టంగా చేపట్టేలా రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. అంనతరం పలు రికార్డులను పరిశీలించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ కిశోర్ బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

30 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వివిధ పరిశ్రమల ప్రతినిధులు నిర్వహించిన జాబ్ మేళాలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ మధుసూదనశర్మ వెల్లడించారు. జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 50 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. జేకేసీ కోఆర్డినేటర్ డీఆర్ వాసప్ప, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్‌లు ఐ.హరికృష్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధమాలలో గ్రామసభ

పెళ్లకూరు: మండలంలోని అర్ధమాల గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు ఎనిమిది అర్జీలు దాఖలయ్యాయి. వన్‌బీ, అడంగల్ కోసం రైతులు అర్జీలను తహశీల్దార్ ద్వార కానాథ్‌రెడ్డికి అందజేశారు. పూర్తిస్థాయిలో పరిశీలించి భూసమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, ఆర్ఐ సంతోషిణిభాయి, వీఆర్ఓలు రమేష్, సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టమూరు(చిల్లకూరు): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. చిట్టమూరు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తగుంట గ్రామానికి చెందిన గుంజి సురేష్(34) అనే దివ్యాంగుడు గ్రామంలోని పెట్రోల్ బంకులో పని చేసేవాడు. ఈ క్రమంలో అతను శనివారం రోజు బైక్‌పై మల్లాం వెళుతుండగా అదుపు తప్పి బోల్తా పడ్డాడు. అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతనిని 108 ద్వారా నెల్లూరుకు తరలించారు. ఆస్పత్రిలో పరిస్థితి విషమించడంతో అతనిని తిరుపతికి తరలించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో వారు అంబులెన్స్‌లో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో అతను మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలి మృతి

బాలాయపల్లి(సైదాపురం): పురుగుల మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన బాలాయపల్లి మండలంలోని కడగుంట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాలాయపల్లి ఎస్ఐ గోపి కథనం మేరకు మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన బొలిగర్ల లక్ష్మమ్మ(60) మతిస్థిమితం సరిగాలేక గతవారం రోజుల క్రితం తమ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగిందని తెలిపారు. తిరుపతి రుయా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలియజేశారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

కలువాయి: కేంద్ర ప్రభుత్వ సంయుక్త ప్రాంతీయ కేంద్రం(సీఆర్‌సీ) నెల్లూరు ఆధ్వర్యంలో కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు ఇచ్చేందుకు సోమవారం శిబిరం ఏర్పాటు చేశారు. వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు తదితరాల కోసం అర్హత కల్గిన 100 మంది దివ్యాంగులు, వృద్ధులను ఎంపిక చేశారు. వారి వద్ద ఉన్న సదరం సర్టిఫికెట్లు, రేషన్, ఆధార్, యుడీఐడీ కార్డులను పరిశీలించి ఎంపిక చేశారు.

అడవిని తలపిస్తున్న శ్రీహరికోట నిర్వాసితుల నివేశన స్థలాల ప్రాంతం(శ్రీహరికోట కాలనీ)



ఇటుక బట్టీలుగా మారిన వెంగమాంబపురం



గ్రామాలే కనుమరుగు

- రెవెన్యూ రికార్డులకే పరిమితమైన పల్లెలు
- క్షేత్రస్థాయిలో అడవులు, సాగు భూమి
- మౌలిక సదుపాయాల లేమి
- అటవీ ప్రాంతంగా శ్రీహరికోట పునరావాసం

దొరవారిసత్రం: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లోని గ్రామాల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో కానరావు. ప్రస్తుతం ఆ గ్రామాలు సాగు భూములుగా, ఇటుక బట్టీలుగా, అటవీ ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నేటికీ రెవెన్యూ గ్రామాలుగానే కొనసాగుతున్నాయి. మండలంలోని ఏకొల్లు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురం, కల్లూరు పంచాయతీ పరిధిలోని సూరాగుంటతాగేలి, అడపాముడి, మీజూరు పంచాయతీలోని కేడీ కండ్రిగ, ఆనేపూడి పంచాయతీలో దామరాయికండ్రిగ గ్రామాలు ఉనానయి. అయితే ఈ పేర్లు గ్రామాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం ఆయా ప్రాంతాల్లో ఒక్క ఇల్లు కూడా ఉండదు. కనీసం అప్పట్లో ప్రజలు నివాసం ఉన్నట్లు ఆనవాళ్లు కూడా కనిపించవు. సుమారు 40–50ఏళ్ల కిందట ఈ ప్రాంతాల్లో వందల మంది ప్రజలు నివాసం ఉండేవారు. ఈ గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు, జీవనోపాధి



శ్రీహరికోట కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఓ బావి

లేకపోవడంతో ఇళ్లు వదిలేశారు. సాగు భూములను అరకొరగా అమ్ముకుని కాలక్రమేణా గ్రామాలనే వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంతాలు మొత్తం సాగు భూములు, మరి కొన్ని బీడుగా కనిపిస్తాయి. వెంగమాంబపురంలో నివాస స్థలాల్లో ఇటుక బట్టీలుగా, కొంత సాగు భూమిగా దర్శనమిస్తోంది. అడపాముడి, సూరగుంటతాగేలి, కేడీకండ్రిగ



గుమ్మిడితాగేలి గ్రామంలో పూజలకు నోచుకోని వెంకటేశ్వరస్వామి ఆలయం

ప్రాంతాలు మాత్రం సాగు భూమిగా, కొంత బీడుగా దర్శనమిస్తున్నాయి.

కనుమరుగు కానున్న మరో గ్రామం

కనుమరుగైన గ్రామాల జాబితాలోకి ఉచ్చూరు పంచాయతీ గుమ్మిడితాగేలి అనే గ్రామం చేరబోతోంది. ఈ గ్రామంలో 22ఏళ్ల కిందటి వరకు గ్రామంలో 40 కుటుంబాలు, ఎస్టీ కాలనీలో 20 కుటుంబాలు వందల మంది జనాభాతో కళకళలాడేది. అయితే నేడు రెండే కుటుంబాలకు పరిమితమైంది. ప్రస్తుతం ఈ గ్రామంలో 15 మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని కాళంగి నది వరద నీరు గ్రామాన్ని ఒకటికి రెండు సార్లు ముంచేసి తీవ్ర ఆస్తి నష్టం కలిగించింది. మార్గం మధ్యలోని దొండ కాలువ వర్షా కాలం వస్తే దాటే పరిస్థితి ఉండదు. ఈ సమస్యలతో పోరాడలేక గ్రామాన్ని వదిలి సూళ్లూరుపేట మండల వెంగాళపురం గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామం నిర్మానుష్యంగా మారి ప్రాథమిక పాఠశాల మూతబడి నిరుపయోగంగా మారింది. స్థానికంగా ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం పూజలకు దూరమైంది.

గ్రామాలు కనుమరుగైనా...

క్షేత్ర స్థాయిలో గ్రామాలు లేకపోయినా రెవెన్యూ అధికారులు మాత్రం అప్పుడప్పుడు ఆ గ్రామాల పేర్లపై గ్రామ సభలు మాత్రం నిర్వహిస్తారు. ఆ సమయంలో మాత్రమే ఊర్ల పేర్లు గుర్తుకువస్తాయి. కొత్తగా వచ్చిన అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని గ్రామాలు ఎక్కడ అంటే ఊర్లు కనుమరుగైపోయి సాగు భూములుగా మారిపోయాయని సమాధానం ఇస్తారు.

శ్రీహరికోట కాలనీ

శ్రీహరికోట(షార్) 1969–70లో ఏర్పడిన సమయంలో ఆ ప్రాంతంలోని సుమారు 50 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. వీరికి నెలబల్లి రెవెన్యూ పరిధిలో కలగుంట గ్రామం రైలు పట్టాలు సమీపంలో పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామానికి వెళ్లే మార్గంలో నివేశన స్థలాలను 30 ఎకరాల్లో ఇచ్చారు. అప్పటిలోనే నిర్వాసితులు ఇళ్లు కట్టుకున్నారు. అప్పట్లోనే ప్రభుత్వం నీటి వసతి కోసం రెండు బావులు తవ్వించి, ప్రాథమిక పాఠశాలను సైతం నిర్మించారు. ఈ ప్రాంతాన్ని అప్పట్లో శ్రీహరికోట కాలనీ అనేవారు. ఇక్కడ నివాసం ఉన్నవారు అంతా బయట ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ వచ్చారు. కొందరు చిన్న చిన్న దుకాణాలను రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసుకుని జీవనం సాగించారు. 30ఏళ్ల కింద కలగుంట వద్ద రైలు పట్టాలు దాటే ప్రాంతంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో శ్రీహరికోట కాలనీ వాసులకు రాకపోకలు ఇబ్బందిగా మారింది. దొంగల బెడద అధికం కావడంతో చేసేది ఏమీలేక కట్టుకున్న ఇళ్లను వదిలి వెళ్లిపోయారు. ఇప్పుడు ఈ ప్రాంతం అంతా చిన్నపాటి అడవిని తలపిస్తోంది. కేవలం రెండు బావులు మాత్రం ఈ కాలనీలో శిథిలావస్థకు చేరుకుని దర్శనమిస్తున్నాయి.

జీవనోపాధి లేక ఖాళీ చేశారు



సూరగుంటతాగేలి, అడపాముడి ప్రాంతాల్లో జీవనోపాధి లేదు. స్థానికంగా మౌలిక వసతులు కూడా కరువు కావడంతో ఈ ప్రాంతాలను వదిలి కల్లూరు, కల్లూరుకండ్రిగ గ్రామాల్లో చేరిపోయారు. దీంతో సూరగుంటతాగేలి, అడపాముడి ప్రాంతాలు ఖాళీ అయిపోయాయి. అయితే ఆ గ్రామాల పేర్లు మాత్రం రికార్డుల్లోనే కనిపిస్తాయి. ఈ ప్రాంతాలు అంతా సాగు భూములుగా మారాయి.

- ఐ.పురుషోత్తం, కల్లూరు గ్రామం

వెంగమాంబపురంలో సౌకర్యాలు లేవు



వెంగమాంబపురం గ్రామంలో అప్పట్లో సరైన సౌకర్యాలు లేవు. అంతే కాకుండా 1984లో వచ్చిన తుపాన్ కారణంగా భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో ఏమీ చెయ్యలేక ఈ గ్రామాన్ని వదిలి చాలామంది వెళ్లిపోయారు. ఇప్పుడు ఈ ప్రాంతం అంతా సాగు భూమిగా మారింది. కొంత ఇటుక బట్టీలుగా మారిపోయింది.

- వి.మునస్వామినాయుడు, ఏకొల్లు గ్రామం

వరదలను తట్టుకోలేక...



గుమ్మిడితాగేలి గ్రామానికి సమీపంలో ఉన్న కాళంగి నది ప్రతి ఏడాది తుపాన్ ప్రభావంతో కురిసే భారీ వర్షాలకు పొంగుతుంది. వరద నీళ్లు అంతా గ్రామాన్ని ముంచేస్తుంది. దీంతో గ్రామంలో ప్రజలు నివాసం ఉండలేకపోయారు. అందుకే గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు. ప్రస్తుతం గ్రామంలో రెండే కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

- ఉగ్గుముడి సుబ్రమణ్యంరెడ్డి, గుమ్మిడితాగేలి గ్రామం



సాగుభూమిగా సూరగుంటతాగేలి ప్రాంతం



గుమ్మిడితాగేలి గ్రామంలో మూతబడిన ప్రాథమిక పాఠశాల

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ అనూష

రాపూరు: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని నెల్లూరు ఆర్డీఓ అనూష అన్నారు. రాపూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రెండో విడత భూ సర్వే ప్రారంభమైందని, పక్కాగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. గిలకపాడు పంచాయతీ పరిధిలోని పిన్నేరు వాగు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. ఇరిగేషన్ అధికారులు వాగుకు సంబంధించి పూర్తి స్థాయిలో సర్వే జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ భవాని, డీటీ అశోక్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శంషాద్ బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు సంబంధించి కార్యకర్తలు–2, సహాయకురాళ్లు –11 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గూడూరులో..

గూడూరు రూరల్: గూడూరు అర్బన్, రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబి కోరారు. జనవరి 6వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గూడూరు అర్బన్‌లో ఆసుపత్రి రోడ్డులో ఎస్సీ కేటగిరీ కింద ఒకటి, మాళవ్యనగర్‌లో బీసీ–ఏ కేటగిరి కింద ఒక కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. రూరల్ ప్రాజెక్టు కింద చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెంలో ఓసీ కేటగిరి కింద ఒక పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. హెల్పర్ల కింద అర్బన్‌లో ఓసీ కేటగిరి కింద ఒక పోస్టు, రూరల్ ప్రాజెక్టు పరిధిలో నెర్నూరులో ఎస్సీ కేటగిరి కింద ఒక పోస్టు, మంగళపూరు బీసీ కాలనీలో బీసీ–డి కేటగిరి కింద ఒక పోస్టు, చిల్లకూరు మండలం బల్లవోలులో ఓపెన్ కేటగిరి కింద ఒక పోస్టు మంజూరయ్యాయని అన్నారు. వీటికి దరఖాస్తు చేసేవారు స్థానికంగా ఉండి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని అన్నారు.

కోటలో..

కోట: కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ మునికుమారి సోమవారం తన కార్యాలయంలో తెలిపారు. చిట్టమూరు(ఓసీ జనరల్), కోట మండలం నెల్లూరుపల్లి(ఓసీ జనరల్) ఖాళీలు ఉన్నాయన్నారు. జనవరి 6 వరకు కోట ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాల కోసం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హక్కులు తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్ తదితరులు

నాయుడుపేట టౌన్: నేటి పోటీ ప్రపంచంలో వస్తువులు కొనుగోలు చేసే వినియోగదారులు వారి హక్కులను తెలుసుకోవాలని నెల్లూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీవేమ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యారంటీ ఇవ్వకుండా నకిలీ వస్తువులు విక్రయించినట్లు తెలిస్తే వెంటనే వినియోగదారుల హక్కుల ఫోరంలో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి దాము మునిరెడ్డి, మండలి సభ్యుడు తొప్పాని కృష్ణయ్య, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచి చేయాలనే సంకల్పంతో..



జేసీబీతో రోడ్డు వేయిస్తున్న ఎంపీటీసీ

సైదాపురం: కాలనీకి మంచి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాడో ఎంపీటీసీ. నడిచేందుకు కూడా వీలు లేకుండా బురదమయంగా మారిన కాలనీ రహదారిని తన సొంత ఖర్చులతో పరిష్కరించారు. ఆయనే స్వయంగా దగ్గర ఉండి పనులు చేయించారు. అనంతమడుగు ఎంపీటీసీగా లేబాక వెంకటరమణయ్య వైఎస్ఆర్ సీపీ తరఫున ఎన్నికయ్యారు. అనంతమడుగు దళితవాడకు చెందిన వెంకటరమణయ్య తన కాలనీకి పోయే రహదారి బురదమయంగా మారుతుండడంతో అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేకుండాపోయింది. ఆ పనులు తానే సొంత ఖర్చులతో చేయించడానికి పూనుకున్నారు. జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను బాడుగకు తీసుకుని సోమవారం పనులను ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు మట్టి తరలించి బురద లేకుండా రహదారిని బాగు చేశారు. దీంతో కాలనీ వాసులంతా ఎంపీటీసీ చేసిన మంచి పనిని మెచ్చుకుంటున్నారు.

26న జూనియర్ టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

చిల్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా జూనియర్ టెన్నికాయిట్ జట్లను ఈ నెల 26న దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి పంతగాని రమ్మ తెలిపారు. కళాశాలలో వారు సోమవారం మాట్లాడుతూ జనవరి 11, 12 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలోని పలాసాలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. పాల్గొనే క్రీడాకారులు 2006 ఏప్రి 1వ తేదిన గానీ, తరువాతగానీ పుట్టినవారై ఉండాలని తెలిపారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా తీసుకురావాలని చెప్పారు.

సేవా కార్యక్రమాలకు శ్రీకారం



నిరాశ్రయులకు సహకరిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ద్వారా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ఇటీవల నూతనంగా ఆర్యవైశ్య మహిళలు వాసవి మహిళా సమాజం ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలోని నిరాశ్రయుల కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నవారికి పండ్లు, దుస్తులు అందించామన్నారు. సుప్రజ, మంజుల, సుజాత, నాగజ్యోతి, లహరి, తేజ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..



ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చిల్లకూరు: అధికార పార్టీకి చెందిన పెద్దలు ప్రభుత్వ భూములు ఎక్కడ ఉంటే అక్కడ కబ్జాలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కడివేడు రెవెన్యూ పరిధిలోని అతి పెద్ద సర్వే నెంబర్ 805లో ఇష్టానుసారంగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కడివేడు రెవెన్యూ పరిధిలోని 937లో (పిల్లగుంట దగ్గర)10 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించి జామాయిల్ సాగు చేపట్టారు. దీనిపై ఈ నెల 14న సాక్షి దినపత్రికలో కబ్జాల కడివేడు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందన్న విషయాన్ని గుర్తించారు. సోమవారం హెచ్చరిక బోర్డులను రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారు.

క్రిస్మస్ కోలాహలం



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ యువత

చిల్లకూరు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. గూడూరు డివిజన్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో క్రీస్తు ప్రభువు చేసిన అద్భుత కార్యాలు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహిస్తూ ప్రతి దుకాణం, ఇంటికి వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. గూడూరులోని సార్వత్రిక క్రైస్తవ సంఘం దైవ సేవకుడు బ్రదర్ వి.డానియల్ రవికుమార్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు సంఘాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చిలు

చిల్లకూరు: క్రిస్మస్ పర్వ దినం సందర్భంగా గూడూరు పట్టణం, మండలంలోని పలు చర్చిలు విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి చెట్టు ప్రార్థనలు, బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి పలు చర్చిలలో విద్యుత్ దీపాలను వెలిగించారు.



విద్యుత్ దీపాల వెలుగులో గూడూరు లూథరన్ చర్చి

అభివృద్ధి పనులు అడ్డుకుంటే చర్యలు

కోట: మండల పరిధిలోని రుద్రవరంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రెండు వర్గాలవారు గొడవకు దిగారు. ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని చోట రోడ్డు వేస్తున్నారంటూ కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గ్రామంలో విచారణ జరిపారు. నాయకులతో సమన్వయం చేసుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కలకలం రేపిన ట్రంకుపెట్టె

తడ: నదిలో కొట్టుకు వచ్చిన ఇనుప ట్రంకు పెట్టె రైతులను, పోలీసులను కలవరపెట్టింది. మండలంలోని చేనిగుంట గ్రామానికి ఎగువన ప్రవహించే కాళంగి నదిలో ఓ ట్రంకు పెట్టె కొట్టుకువచ్చి సోమవారం స్థానిక రైతుల కంటపడింది. నది ఒడ్డున కనిపించిన ట్రంకుపెట్టెను చూసిన రైతులు దాని దగ్గరకు వెళ్లే సాహసం కూడా చెయ్యకుండా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రంకుపెట్టెను ఒడ్డుకు దగ్గరగా చేర్చారు. పెట్టె లోపల పరిశీలించిన పోలీసులు అందులో ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పామంజిలో చోరీ

వాకాడు: పామంజి గ్రామంలోని రొయ్యల చెరువుల వద్ద ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు పామంజి గ్రామానికి చెందిన ఆదిశేషారెడ్డి అనే ఆక్వా రైతుకి సంబంధించిన రొయ్యల చెరువుల్లోకి రైతు లేని సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి షెడ్ తాళాలు పగలగొట్టి పరికరాలు ఎత్తుకెళ్లారు. అందులో రెండు విలువైన విద్యుత్ మోటార్లు, 1 స్టార్టర్, 10 ఏరియేటర్ వైర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం ఉదయం గమనించిన ఆక్వా రైతు లబోదిబోమంటూ వాకాడు పోలీసులకు సమాచారం అందించారు.